

## 'మూర్తి'

—o—

వెళ్ళక వెళ్ళక అత్తవారింటికి వెళ్ళాను. రాత్రి ఎనిమిది గంటలయింది.

అప్పుడే పొలంలోనుంచి వచ్చి స్నానం కాగానే భోజనంచేసి కుర్చీలో కూర్చున్నా 'Anna Karenina' అనే Tolstoy నవల చదువుతూ. కథ మాత్రం మంచి రసపట్టులో ఉంది: కథాం నాయకురాలు తన ఉపభర్తతో లేచి పోవుటకు ధర్మశాస్త్రరీత్యా వివాహమాడిన భర్తను, కన్నకుమారుని వదలిపెట్టుటకు ఆలోచించుకుంటూ, దానిలోని సాధక భోధకాలు చర్చించుకుంటూంది. నామనస్సంతా కథ మీదనే ఉంది. లోపల ఆడవాళ్లు భోజనా లవుతున్నాయి; వాళ్ల గొడవలో వాళ్లున్నారు. ఉయ్యాలలో నిద్రపోతున్నాడు మా అబ్బాయి.

ఇంతట్లోకే 'కోడు, కోడు' అనే శబ్దం, యిల్లా ఒకమాటు రావాలి చప్పున అన్నపిలుపు ఒకే సారి ప్రతిధ్వనించాయి నా చెవులలో. ఉలిక్కి-పడ్డాను ఆ కేకతోటి. అంత ఖంగారుగా పిలిచేవారు మా ఆవిడ తప్ప మరొకరు లేరని నా అభిప్రాయం. ఇంతట్లోకే "తేలు కాదు, తేలైతే అంత చప్పున పరుగెత్తలేదు. అది తప్పకుండా పురికొస అయి ఉండాలి" అన్నమాటలు చెవిని పడ్డాయి. ఎంతమట్టుకు నిజమో కాని పురికొస కుట్టితే సాధారణంగా బ్రతకడం దుర్లభం అంటారు. అది అంటే మా ఆవిడకు మా చెడ్డ భయం. నిజం చెప్పవలసివస్తే ఆవిడకు కప్ప అంటేనే భయం. ఒకసారి రాత్రి లాంతరు పుచ్చుకొని దొడ్లోకి వెళ్ళింది. కప్ప ఒకటి ఆ దారిని వెడుతూవుంటే దానిని చూచి 'చచ్చేనర్రోయి' అని ఒక్క గంతేసింది దొడ్లోనుంచి యింట్లోకి. 'ఎందుకంత ఖంగారు పడ్డా'వని తరువాత అడిగితే 'అది మీద కొస్తుందేమో'నని సమాధానం యిచ్చింది. అల్లాంటి దానికి పురికొస అంటే భయం కలగడం ఆశ్చర్యం ఏముంది!

నేను లేచి వెళ్ళబోతుంటే మా ఆవిడ వచ్చి "ఓమూల పురికొస యింట్లోకి వస్తే యింకా

అల్లా కూర్చున్నా రేం?" అంది అతి ఖంగారుగా ఏదో కొంప మునిగిపోయినట్లు. మా ఆవిడ ఆజ్ఞ ప్రకారం దానిని చంపడానికి ఆయుధ మొకటి తీసుకుని వెళ్ళేటప్పటికి, పీటక్రింద దూరిందని పీట ఎత్తేసరికి అది ఏమూలకు పోయిందో మళ్ళీ కనుపించలేదు. నే వెళ్ళి అక్కడ ఉన్న మడి నీళ్ళ బిందెలు, ఊరగాయి రాచ్చిప్పలు తీయించి చూచినా దాని దర్శనం అవలేదు మాలో ఎవరికీని. ఇంతట్లోకే పిండి తింటూన్న మా అమ్మమ్మకి వెనకాల గోడమీద సాలిపురు గొకదానిని చూచి "పురికొస కాదు ఏమీ కాదు, సాలి పురుగు" అని నిశ్చయించుకున్నాం. నాలో నాకే సిగ్గేసింది ఆడవాళ్ళ మాట పట్టుకుని నేను కూడా ఖంగారు పడ్డానని.

మా ఆవిడకు మాత్రం దృఢ అభిప్రాయం పురికొస నిజంగా యింట్లో ఉందని. అనుమానం తీరక విస్తళ్ళు, చెంబులుకూడా పరీక్ష చెయ్యడంలో మళ్ళీ ఏదో పీటక్రిందకు ప్రాకింది పిషావరు ఎక్స్‌ప్రెస్ లాగ. ఆపళంగా నేను వెళ్ళి పెద్ద hero లాగ పీట ఎత్తేసరికి, అది నా కాళ్ళ క్రిందకు రావడం, నేను ఎత్తిన పీట క్రింద పారవేయడం, నా వెనక అవతల లాంతరు పట్టుకు నిల్చున్న మా ఆవిడ ఆ లాంతర్ని నుంచున్న పళంగా క్రింద పారేసి, అయిదారు గజాల వెనకాల ఉన్న గుమ్మం అవతల పడడం—యివన్నీ ఒక్కసారి జరిగాయి.

ఉయ్యాలలో నిద్రపోతూవున్న పిల్లాడు 'కెవ్వు' మన్నాడు. మా ఆవిడకు భయం అవడం చేత నేనే వెళ్ళి పిల్లవాణ్ణి తీసుకుని వెళ్ళి తాపీగా పీట ఎత్తి చూతును కదా! గోడను అంటిపెట్టుకుని ఒక ఎలకపిల్ల ఉండి, పీట ఎత్తీ ఎత్తడంతోటే దొడ్లోకి ఉరుకెత్తింది తలుపు సందులోనుంచి. ఇంక అక్కడ ఆట్టేసేపు కూర్చుంటే నిజంగా ఏదయినా రాగలదని నీళ్లు కారుతో ఉన్న చారు అన్నం వదలి మజ్జిగతో రెండు మెతుకులు నోట్లో వేసుకుని వాకిట్లోకి వచ్చి పడ్డారు అందరూను.

రాత్రి నిద్రలో అయిదారుసార్లు "అమ్మా, ఎలక పిల్లే!" అంటూనే ఉన్నాడు మా అబ్బాయి. నాకూ అదే కల తెల్లవార్లూను. మా ఆవిడ సంగతిమాత్రం నాకు తెలియదు.

మీకు కావలసిన చక్కని యుడుపులు, గుడ్డలు, పలువిధములైన స్వదేశీ సిల్కు చీరలు, జాకెట్టు రకములును

కేశవరామ్ అండ్ కంపెనీ,

1/287, ఎస్ప్లనేడ్ రోడ్డు, మద్రాసున దొరకును. మంచి సరకులు! చాల సరసము!